క్లుప్తంగా

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలి



పట్టణంలో ప్లాస్టిక్ వాడకంపై తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఏలేశ్వరం: పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కె.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం దాడులు నిర్వహించి, ప్లాస్టిక్ వాడకంపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి ముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు నియంత్రించాలన్నారు. ప్లాస్టిక్ బదులుగా క్లాత్ వస్తువులను వాడాలన్నారు. ప్రజలకు, వ్యాపారులకు వీటిపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లిపూడిలో స్వచ్ఛభారత్



అల్లిపూడిలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చినబాబు

కోటనందూరు: ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా తుని ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం అల్లిపూడిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు ప్రారంభించారు. విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అపరిశుభ్ర వాతావరణంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్లు, పరిసరాలు, డ్రైన్లు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం చీపుర్లు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏవీ రమణ, ఆదిత్య డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఎండీ షాహిద్దిన్, ఎన్ఎస్ఎస్ పీఓ కె.తమ్మారావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

గండేపల్లి: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు గండేపల్లికి చెందిన నొక్కు లలిత గ్రామంలో ఆశ వర్కర్‌గా పనిచేస్తోంది. భర్త సుధాకర్‌తో గొడపడి ఆదివారం ఇంటి నుంచి వెళ్లి పోయిందని అప్పటి నుంచి తిరిగిరాలేదు. పలుచోట్ల వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో లలిత తల్లి విజయదుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.

బాలికల వసతి గృహం పరిశీలన



వసతి గృహంలో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న రాజేశ్వరి

ప్రత్తిపాడు: స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహాన్ని పెద్దాపురం బీసీ వసతిగృహాల సహాయ సంక్షేమాధికారి ఎన్.రాజేశ్వరి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వసతిగృహ రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వసతిగృహ నిర్వాహణపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి ఎం.శైలజారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిని పునరుద్ధరించాలి

గోకవరం: మండలంలోని గోకవరం-జగ్గంపేట ప్రధాన రహదారిలో సూదికొండ నుంచి జగన్నాథపురం వరకూ ఉన్న రహదారిని తక్షణమే పునరుద్ధరించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. పార్టీ నాయకులతో కలిసి మంగళవారం రహదారిపై ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే రోడ్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మంగరౌతు రామకృష్ణ, అడపా భరత్‌బాబు, పాలూరి బోసుబాబు, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కోసం ప్రార్థనలు

ప్రత్తిపాడు: మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆరోగ్యంగా ఉండాలని, కేసుల నుంచి బయటపడాలని కోరుతూ టీడీపీ నాయకులు మంగళవారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో ప్రత్తిపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి పంచాయతన ఆలయం, మసీదు, చర్చిలలో నాయకులు, కార్యకర్తలు ప్రార్థనలు నిర్వహించారు.

కిర్లంపూడి: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జైలు నుంచి విడుదల కావాలంటూ ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ మండల టీడీపీ నాయకులతో కలిసి మంగళవారం స్థానిక మసీద్‌లో నమాజ్ జేశారు. మండల అధ్యక్షుడు చదరం చంటిబాబు, సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత పాల్గొన్నారు.

ఉపాధికి ఊతం

- గ్రామాల్లో చిన్నతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం
- పీఎంఈజీపీ ద్వారా రాయితీపై రుణాలు
- చిరువ్యాపారులకు ఎంతో ప్రయోజనం

తొండంగి: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకం పీఎంఈజీపీ (ప్రైమ్ మినిస్టర్స్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం) అమలు చేస్తోంది. ఈ పథకంలో చిన్న తరహా, సేవా, తయారీ పరమైన యూనిట్లు ఏర్పాటుకు రుణాలపై రాయితీ అందిస్తోంది. దీంతో చిరు వ్యాపారులు, చిన్న తరహా పరిశ్రమలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయి. ఎంతో మంది ఉపాధి లభిస్తుంది. గ్రామాల అభివృద్ధికి ఎంతోగానో తోడ్పడుతుంది.

పథకం తీరు ఇదీ..

పీఎంఈజీపీ పథకానికి ఏపీ ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ద్వారా ప్రభుత్వం అమలుచేస్తోంది. లబ్ధిదారులు దరఖాస్తు చేసిన ప్రాజెక్టు విలువపై 35 శాతం వరకూ రాయితీ ఇస్తుంది. ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి రుణం పొందవచ్చు. ఉదాహరణకు లబ్ధిదారుని ప్రాజెక్టు వ్యయం రూ.10 లక్షలు అయితే రూ.లక్ష మాత్రమే అర్జీదారుడు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. మిగిలిన 90 శాతం రుణం బ్యాంకు ద్వారా కల్పించగా దానిలో రూ.3.5 లక్షలు రాయితీగా కేంద్ర ప్రభుత్వం అర్జీదారుని తరుపున బ్యాంకుకి చెల్లిస్తుంది. బ్యాంకుకి అర్జీదారుడు చెల్లించాల్సిన రుణం నికరంగా రూ.5.5 లక్షలుగా ఉంటుంది.

దరఖాస్తు చేసుకోవాలిలా..

అర్జీదారుడు స్వయంగా కానీ, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం, రీసోర్సు పర్సన్ల సహకారంతో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న అనంతరం ప్రాజెక్టు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అనంతరం అప్లికేషన్ జిల్లా పరిశీలనా కమిటీకి పంపుతారు. అనంతరం దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అనుమతులు మంజూరు చేసి దరఖాస్తుదారు ఎంచుకున్న బ్యాంకుకి పంపుతారు. బ్యాంకు అధికారులు నిబంధనల మేరకు ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించి రుణం మంజూరు చేస్తారు.

పథకంలో ఉన్న ప్రాజెక్టులు

ఈపథకంలో ముఖ్యంగా అర్జీదారులు ఏపీ జనరేటర్స్, పుట్టగొడుగులు పెంపకం, ఐరన్ బీరువాలు తయారీ, వుడెన్ ఫర్నిచర్, కుండల తయారీ, ఫ్రిడ్జ్‌స్ తయారీ, సోడాల తయారీ, ఆర్వో వాటర్ ప్లాంట్, వాటర్ బాటిల్స్ తయారీ, పేపర్ కప్స్, ప్లేట్స్ తయారీ, ఏడీపీఈ పైప్స్ తయారీ, సిమెంటు తూరలు, ఫ్లైయాష్ వంటి ఇటుకల తయారీ, బ్లీచింగ్, పినాయిల్, సబ్బులు తయారీ, ఇంజినీరింగ్ వర్క్స్, వెల్డింగ్, టెంట్ హౌస్, మంటపం డెకరేషన్, సెంట్రింగ్, మార్బుల్స్, గ్రానైట్స్ నిర్మాణం, డీజే సౌండ్ సిస్టమ్, లైటింగ్ సౌండ్ సిస్టమ్, పచ్చళ్ల తయారీ వంటి ప్రాజెక్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.



ఎ.కొత్తపల్లిలో పీఎంఈజీపీ పథకంలో ఏర్పాటు చేసిన పచ్చళ్ల తయారీ ప్రాజెక్టు

దరఖాస్తుకు ఇవ్వాల్సిన పత్రాలు

లబ్ధిదారుని ఆధార్‌కార్డు(పార్టనర్స్ అయితే వారివి కలిపి ఇవ్వాలి), పాన్‌కార్డు, అడ్రస్ ప్రూఫ్ కరెంట్ బిల్లు, బ్యాంకు పాస్‌బుక్, ఇంటిపన్ను రశీదు, లీజ్ అగ్రిమెంట్, జీఎస్టీ, ఐటీ రిటర్న్స్, పాస్ పోర్టు సైజ్ ఫోటోలు తదితర వివరాలతో కూడిన పత్రాలు అందించాల్సి ఉంది.

పది యూనిట్లు వచ్చాయి



ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకంలో మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ 10 యూనిట్లకు దరఖాస్తులు వచ్చాయి. వాటిని జిల్లా పర్యవేక్షణ కమిటీకి పంపించి రుణాల మంజూరు సిఫారసులు చేశాం. చిరు వ్యాపారులకు, డ్వాక్రా మహిళ సంఘాలకు, చిరు పారిశ్రామికవేత్తలకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– వై.సత్తిబాబు, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథం, తొండంగి

రుణానికి దరఖాస్తు చేసుకున్నాం



మేము పచ్చళ్ల తయారీ కోసం పీఎంఈజీపీ పథకంలో రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాం. 35 శాతం రాయితీ వస్తుందన్నారు. ఈ రాయితీ మాకు ఆర్థికంగా తోడ్పాటునిచ్చింది. మాలాంటి చిరు వ్యాపారులకు ఎంతగానో ఉపయోగపడుతోంది.

– ఎ.అమ్మాజి, పచ్చళ్ల తయారీ నిర్వాహకురాలు, ఎ.కొత్తపల్లి, తొండంగి మండలం

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



తుని రాజాహైస్కూల్లో మాట్లాడుతున్న లోవరాజు తదితరులు

తుని: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మనస్తత్వ వేత్త చల్లా లోవరాజు అన్నారు. వరల్డ్ మెంటల్ హెల్త్ డే సందర్భంగా తుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రాజా ప్రభుత్వ హైస్కూల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మానసిక ఆరోగ్యం(మెంటల్ హెల్త్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా లోవరాజు విద్యార్థి దశలో వచ్చే కోపం ఎలా అదుపు చేసుకోవాలి, ఈ వయస్సులో ఉండాల్సిన ఆలోచన విధానం, చదువుపై ఎలా దృష్టి పెట్టాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు కేఎస్ఎల్ఎస్ వర్మ, కార్యదర్శి కె.కిషోర్‌రెడ్డి, ట్రెజరర్ కె.గణేష్, సీహెచ్ మంగరాజు, డీవీ రాజు, కె.గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భాగవత గ్రంథం వితరణ



భక్తులకు గ్రంథాలు అందజేస్తున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు దంపతులు

గోకవరం: అచ్యుతాపురం గ్రామంలో సనాతన ధర్మ ప్రబోధనా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సహస్ర భాగవత గ్రంథం వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొని గ్రామస్తులకు భాగవత గ్రంథాలను అందజేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, ప్రధాన కార్యదర్శి అక్షింతల రాజా మాట్లాడుతూ భాగవత గ్రంథం ప్రతి ఒక్కరినీ తరిస్తుందన్నారు. అనంతరం ఎంపీపీ దంపతులను సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కొత్తపల్లి సత్యనారాయణ, అమరా యతిరాజులు, కొత్తపల్లి ప్రసాద్, బొద్దపు చంద్రరావు, దోసపాటి సుబ్బారావు, పిల్లంగోరు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పందుల సంచారం



పెద్దవీధిలో సంచరిస్తున్న పందులు

ఏలేశ్వరం: పట్టణంలో విచ్చలవిడిగా పందుల సంచారంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని పెద్దవీధి, తోట వీధి, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల్లో పందులు విపరీతంగా సంచరిస్తున్నాయి. వీటి సంచారంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. వీటిని నిరోధించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన పంట కాలువ అధ్వానం



కాలువలో పేరుకుపోయిన చెత్త

ఏలేశ్వరం: వందలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న పట్టణంలోని ప్రధాన పంట కాలువ అధ్వానంగా తయారైంది. పట్టణంలో సుమారు కిలోమీటన్నర ఉన్న కాలువలో చెత్త పేరుకుపోయింది. ఖరీఫ్ ప్రారంభం కానుండడంతో దిగువ ప్రాంతాలకు సాగునీరు అందడంలేదు. కాలువను ఆనుకుని దుకాణాలు, హోటల్స్, ఆసుపత్రుల్లోని చెత్తను కాలువలో వేస్తున్నారు. దీంతో దుర్గంధంతో పాటు కాలువ చాలా వరకు కుంచించుకుపోయింది. ప్రస్తుతం చెరువుల్లో నీటినిల్వలు అంతంతమాత్రంగా ఉండగా కాలువలోని చెత్తతో నీటిసరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉక్కబోతతో ప్రజలు విలవిల

తుని: వర్షాలు కురిసే సమయంలో ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గడచిన వారం రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు నమోదవుతున్నాయి. దీంతో పాటు గాలి వీయకపోవడం వలన ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఇక ఖరీఫ్ పంటలకు అవసరమైన నీరు లేకపోవడంతో ఎండిపోతున్నాయి. వాతావరణంలో వచ్చిన మార్పుల వలన ఉష్ణోగ్రతలు పెరిగాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



ప్రదర్శనలో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద ఉన్న ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి, పద్మావతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ నగర మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాతిగాంచిన సుమారు 50 పైగా డిజనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబయి, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కత్తా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి ప్రముఖ డిజైనర్లు వీటిని తీసుకొచ్చి నగర ప్రజలకు పరిచయడం చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 12వ తేదీ రాత్రి 9 గంటలు వరకూ ఉంటుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎండుతున్న ఖరీఫ్ వరినాట్లు



రాజుపేటలో ఎండుతున్న వరినాట్లు

తుని రూరల్: వర్షాధారంగా సాగవుతున్న ఖరీఫ్ వరినాట్లు మండుతున్న ఎండలకు ఎండిపోతున్నాయి. సాగునీటి లభ్యతలేకపోవడంతో నాట్లు వేసిన భూములు నెరలు వీడుతున్నాయి. మండలంలో ఆరువేల ఎకరాల్లో ఖరీఫ్ నాట్లు వేయాల్సి ఉండగా రైతులు 50 శాతం నాట్లు వేశారు. కొన్ని గ్రామాల్లో వరినారు మడులు ఇప్పటికే ఎండిపోయాయి. నాట్లు వేసిన రాజుపేట, మర్లపాడు, లోవకొత్తూరు, డొండవాక, ఎన్.ఎస్.వి.నగరం, ఎస్.అన్నవరం, తదితర గ్రామాల పరిధిలో సాగునీరు అందని భూముల్లో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. వర్షాలు కురవకపోవడంతో సాగునీరు చెరువుల్లో సైతం చిక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. వర్షాలు కురిస్తేనే పంటలను రక్షించుకోగలమని రైతులు తెలిపారు.

రేపు కేసీబీఎస్ వందేళ్ల సంబరాలు

సంస్థ అధ్యక్షుడు కోసూరి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి

కాకినాడ: ది కాకినాడ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ఏర్పాటై వందేళ్ల పూర్తి చేసుకుని 101వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా గురువారం సాయంత్రం 5 గంటలకు స్థానిక సూర్యకళామందిరంలో వేడుకలు నిర్వహిస్తున్నట్టు కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి చెప్పారు. కార్యక్రమ ఏర్పాట్లపై శనివారం సంస్థ డైరెక్టర్లు, ప్రతినిధులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తమిళనాడు మాజీ చీఫ్ సెక్రటరీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.రామ్మోహనరావు, గౌరవ అతిథులుగా ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, ఇన్‌కం టాక్స్ విశ్రాంత చీఫ్ కమిషనర్ పీవీ రావు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ఆర్.మంగబాబు తదితర ప్రముఖులు హాజరుకానున్నారు. సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షుడు రెడ్డి వీరరాజేంద్రకుమార్, కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బుచ్చిరాజు శివ బాలయోగి, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, ఇన్‌చార్జి మేనేజర్ చీమలకొండ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

రేపు వికాసలో ఇంటర్వ్యూలు

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో గురువారం రిలయన్స్ రిటైల్ (హైదరాబాద్) కంపెనీలో పికింగ్ అండ్ ప్యాకింగ్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె లచ్చారావు మంగళవారం తెలిపారు. ఈ ఉద్యోగానికి ఎస్ఎస్‌సి ఉత్తీర్ణులైన 18 నుంచి 30 సంవత్సరాల లోపు స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.15,770 జీతం, నైట్ షిఫ్ట్ అలవెన్సెస్, అటెండెన్స్ బోనస్, రవాణా సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్సులతో హాజరు కావచ్చని పీడీ తెలిపారు.



ఎస్.పైడిపాలలో మాట్లాడుతున్న గొల్లు చినదివాణం



లింగంపర్తిలో కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తదితరులు



ఉప్పలపాడులో మందుల కిట్లు అందజేస్తున్న నాయకులు, అధికారులు



కేపీ మల్లవరంలో శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

ఆరోగ్యాంధ్రప్రదేశే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- నెల్లిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష



నెల్లిపూడిలో రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

శంఖవరం: ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందించి, ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. నెల్లిపూడి సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు మందులు,అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. ఎంపీపీ పర్వత రాజుబాబు, ఎంఈఓ ఎస్వీ రమణ, వైద్యులు ఎస్.రాజీవ్, సౌమ్యశ్రీ, మండల కన్వీనర్ నరాల శ్రీను, వజ్రకూటం సర్పంచ్ సకురు గుర్రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు నరాల తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో...

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు మందుల కిట్లు, గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లను అందజేశారు. వైద్యులు నిస్సీ, విక్రం, శివకుమార్, ఆర్.పవన్‌కుమార్, గీతా సుధ 670 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, బెంతుకుర్తి సుశీల, మండల కోఆప్షన్ సభ్యుడు గంగా మహాలక్ష్మీరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ శేరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లింగంపర్తిలో...

ఏలేశ్వరం: లింగంపర్తి గ్రామంలో రెండో రోజు మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు మందుల కిట్లు అందజేశారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రారంభించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే జగనన్న ఆరోగ్య సురక్ష అమలు చేస్తున్నారన్నారని ఆయన అన్నారు. ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, వైద్యులు శ్రీలక్ష్మీ, పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పలపాడులో...

గండేపల్లి: ఉప్పలపాడులో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు గ్రామ సర్పంచ్ అడబాల ఆంజనేయులు, సుబ్బయమ్మపేట సర్పంచ్ బొబ్బర శివ, ఎంపీడీఓ బీకేఎస్ఎస్‌వీ రామన్, తహసీల్దార్ కెవివి సత్యనారాయణ తదితరుల చేతుల మీదుగా మందుల కిట్లు అందజేశారు. ఈఓపీఆర్డీ మూర్తి, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేపీ మల్లవరంలో...

కోటనందూరు: కేపీ మల్లవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ వేముల సత్యవేణితో కలిసి ఎంపీపీ లగుడు శ్రీనివాసు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వేముల రాజబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, ఏఎంసీ మండలాధ్యక్షుడు సుర్ల రాజు, కోఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు, నాయకులు కొరుప్రోలు కృష్ణ, కురసా మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సోమరాయణంపేటలో...

కిర్లంపూడి: సోమరాయణంపేటలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు సరిసే సంతోష్ ప్రారంభించారు. వైద్యులు 563 మందికి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మరో 14 మందిని మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఫార్మాసిస్టు కె.తాతారావు, న్యూడల్ ఆఫీసర్ సూర్య ప్రకాష్, డి.గంగాధర్, వి.జేమ్స్, మరియమ్మ, రాజా, లక్ష్మీనారాయణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఇటికాయలపల్లిలో...

గోకవరం: ఇటికాయలపల్లి గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సుంకర వీరబాబు, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌ఛార్జి గుల్లా ఏడుకొండలు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 519 మంది వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు, స్థానిక నాయకులు కందేపల్లి రాంబాబు, తుపాకుల నాగేశ్వరరావు, ఎంపీటీసీ గల్లా కృష్ణ, డాక్టర్లు అనూష, వికాస్, సునీల్, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

పి.ఇ.చిన్నాయపాలెంలో..



పి.ఇ.చిన్నాయపాలెంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న నాగం గంగబాబు

తొండంగి: పి.ఇ.చిన్నాయపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ నవరత్నాల్లో భాగంగా ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్న సంకల్పంతోనే ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల కోసం ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. వైద్యశిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ పసపులేటి సతీష్, మండల సీనియర్ వైద్యులు పి.రవికుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, తుని వ్యవసాయ మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దూళ్లిపూడి అంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, ఆరోగ్య మిత్ర రమేష్ పార్టీనాయకులు పాల్గొన్నారు.

ఎస్.పైడిపాల గ్రామంలో

రౌతులపూడి: ఎస్.పైడిపాలలో ఎంపీడీఓ ఎం.గోవిందు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జెడ్పీటీసీ గొల్లు చినదివాణం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వైద్యులు 356 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, పార్టీ నాయకులు జిగిరెడ్డి సత్తిబాబు, రాయి ప్రసాదు, పోలుపర్తి తాతాజి పాల్గొన్నారు.